# ప్రభుత్వ రంగ సంస్థలను, బిఎస్ఎన్ఎల్‌ను, కార్మిక హక్కులను, ఈపిఎఫ్‌ను, పెన్షన్‌ను పరిరక్షించేందుకు 2019 జనవరి 8, 9 తేదీలలో జరుగు 18వ దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో పాల్గొనండి

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ప్రైవేటీకరణ విధానాలకు, కార్మిక వ్యతిరేక విధానాలకు, ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా 2019 జనవరి 8,9 తేదీలలో దేశవ్యాపితముగా అన్ని రంగాలలో రెండు రోజుల సార్వత్రిక సమ్మెకు కేంద్ర ట్రేడ్ యూనియన్లు, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వోద్యోగుల సంఘాలు, బ్యాంకు, ఇన్సూరెన్సు, బిఎస్ఎన్ఎల్ తదితర ఉద్యోగుల సంఘాలు, అసంఘటిత రంగానికి చెందిన కార్మికుల సంఘాలు పిలుపునిచ్చాయి. బిఎస్ఎన్ఎల్‌లో బిఎస్ఎన్ఎల్ ఈయు, ఎన్ఎఫ్‌టిఈ, బిఎస్ఎన్ఎల్ ఎంఎస్, టిఈపియులు సమైక్యముగా సమ్మె నోటీసునిచ్చాయి.

**డిమాండ్స్**

1. **ప్రభుత్వరంగ సంస్థల డిజిన్వెస్ట్‌మెంటు, మరియు ప్రైవేటీకరణ ఆపాలి**

2014లో అధికారంలోకి వచ్చిన అనంతరం మోడీ ప్రభుత్వము గత 4 సంవత్సరాలలోనే ప్రభుత్వరంగ సంస్థల వాటాల అమ్మకం, ప్రైవేటీకరణ వలన రూ. 2,09,896 కోట్లు రాబడి సాధించింది. ఇది 1991 నుండి వచ్చిన దానిలో 58 శాతం. మోడీ ప్రభుత్వం రైల్వేలైన్లను, రైల్వేస్టేషన్ల నిర్వహణను, 8 విమానాశ్రయాలను, 24 ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటుపరం చేయాలని నిర్ణయించింది. యుద్ధ విమానాలు, యుద్ధ నౌకలు, సబ్మెరైన్లు, ఆయుధాలు, వెహికిల్సు తదితర రక్షణ రంగ సామాగ్రి తయారీలో అనుభవం వున్న ప్రభుత్వరంగ సంస్థలను కాదని అనుభవం లేని ప్రైవేటు కంపెనీ రిలయన్సు డిఫెన్స్‌కు, ఇతర ప్రైవేటు కంపెనీలకు, విదేశీ కంపెనీలకు ఆర్డర్లు ఇస్తున్నది. భారీ కుంభకోణాలకు ఇది దారి తీస్తున్నది. దేశ భద్రతకు ముప్పు తెస్తున్నది. కార్పొరేట్లకు సంవత్సరానికి రూ. 5 లక్షల కోట్ల పన్ను రాయితిలిస్తున్నది. అవి ఎగగొట్టిన లక్షల కోట్ల పన్నులు, అప్పులను వసూలు చేయటం లేదు. దీనివలన జాతీయ బ్యాంకులు నష్టాల పాలయ్యాయి. ఇంతేగాక మళ్ళీ బ్యాంకుల నుండి కార్పొరేట్లకు అప్పులిచ్చేందుకు ప్రభుత్వ ఖజానా నుండి నిధులను బ్యాంకులకు తరలిస్తున్నది. ఈ విధానాల వలన ఏర్పడే బడ్జెట్ లోటును తగ్గించుకోటానికి ప్రభుత్వ రంగాన్ని ఉధృతముగా ప్రైవేటుపరం చేస్తున్నది. ఎన్నడూ లేని విధముగా రిజర్వ్ బ్యాంకు నిధులను కూడా కార్పొరేట్ల ప్రయోజనాల కోసం వాడే పనిలో వున్నది. పైకి వ్యక్తిగత కారణం అన్నప్పటికి ఇందుకు నిరసనగానే రిజర్వు బ్యాంకు గవర్నర్ ఉర్జిత్ పటేల్ రాజీనామా చేశారని అందరూ నమ్ముతున్నారు. అడ్డగోలుగా 4 జి స్పెక్ట్రమ్ సాధించిన రిలయన్స్ జియోని ప్రోత్సహించి నష్టాల నుండి కోలుకుంటున్న బిఎస్ఎన్ఎల్‌ను మళ్ళీ నష్టాలు పెరిగే స్థితికి మోడీ ప్రభుత్వం దిగజార్చింది. మన వేతన సవరణ దీనివలన కఠినతరమవుతున్నది. బిఎస్ఎన్ఎల్‌లో మనము ఐక్యముగా వుండి పోరాడుతున్నందున నష్టాలలో వున్నప్పటికి వేతన సవరణ పై మంత్రిగారు చర్చలకు పిలిచి కొన్ని హామీలిచ్చేలా చేయగలిగాము. కానీ మనము సాధించినది వమ్ము కాకుండా వుండాలంటే, బిఎస్ఎన్ఎల్‌ను ప్రైవేటు పరం కాకుండా ఆపాలంటే, ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణ విధానాలను ప్రభుత్వం విరమించేలా చేయాలి.

2. **బోనస్, ఈపీఎఫ్, డిసిఆర్జిలపై వున్న అన్ని రకాల సీలింగులను రద్దు చేయాలి. గ్రాట్యుటిని పెంచాలి**

బోనస్ అర్హతకి రు.21000 వేతనం, లెక్కింపుకి రూ. 7000 వేతనం, చెల్లింపుకి సంవత్సర వేతనంలో 20 శాతం అనే సీలింగులు బోనస్ చట్టంలో వున్నాయి. బిఎస్ఎన్ఎల్ మేనేజిమెంటు ఉద్యోగి ఈపిఎఫ్ ఖాతాకి ఉద్యోగి మొత్తం వేతనం పై 13.61 శాతాన్ని కంట్రిబ్యూట్ చేస్తున్నది. ఆర్థిక పరిస్థితి బాగా లేదనుకుంటే కేవలం రూ. 15000 పై మాత్రమే ఈ కంట్రిబ్యూషన్ చెల్లించేందుకు ఈపిఎఫ్ చట్టం అనుమతి ఇస్తున్నది. డిసిఆర్‌జి (డెత్ కమ్ రిటైర్మెంట్ గ్రాట్యుటి) చెల్లింపుకి రూ. 20 లక్షలు, లెక్కింపుకి 16.5 నెలల వేతనం అనే సీలింగులున్నాయి. ఈ సీలింగులన్నింటిని రద్దు చేయాలని డిమాండ్ చేస్తున్నాము.

3. **కార్మికులందరికి సామాజిక భద్రత, అందుకు తగిన నిధుల కేటాయింపు**

ఈపిఎఫ్, ఈఎస్ఐ, పెన్షన్ తదితర సాంఘిక భద్రత స్కీములను మెరుగుపరచేందుకు ఒక సమగ్ర సాంఘిక భద్రతావిధానాన్ని రూపొందించి దానిని సంఘటిత, అసంఘటిత కార్మికులందరికి వర్తింపజేయాలి.అందుకు తగిన నిధులు కేటాయించాలి.

4. **కార్మికచట్టాలలో వున్న హక్కులను ఖచ్చితముగా అమలుచేయాలి. ఉల్లంఘించిన యాజమాన్యాలను కఠినముగా శిక్షించాలి.**

5. **కార్మిక హక్కులు రద్దు చేసేందుకు కార్మిక చట్టాలకు తలపెట్టిన సవరణలను విరమించాలి**

మోడీ ప్రభుత్వం ఇప్పుడున్న 44 కార్మిక చట్టాలను రద్దుచేసి వాటి స్థానంలో నాలుగు కోడ్స్‌ను ప్రతిపాదించింది. సమ్మె హక్కు, యూనియన్ ఏర్పాటు హక్కు, సాంఘిక భద్రత, వేతనాల చెల్లింపు హక్కు, పని ప్రదేశాలలో భద్రత తదితర కార్మిక హక్కులన్నింటిని రద్దు చేయటం మరియు యజమానులు ఇష్టా రాజ్యముగా తమ కంపెనీలను మూసివేసేందుకు, కార్మికులను తొలగించేందుకు అనుమతించటం ఈ కోడ్‌ల ఉద్దేశం. రెగ్యులర్ ఉద్యోగాల వ్యవస్థని రద్దుచేసి తాత్కాలిక ఉద్యోగాల వ్యవస్థని రుద్దేందుకు మోడీ ప్రభుత్వం ఫిక్సెడ్ టర్మ్ ఎంప్లాయ్‌మెంట్ ఆర్డర్సు ఇచ్చింది. అప్రెంటిస్ చట్టాన్ని సవరించింది. ఈ కోడ్‌లను, ఆర్డర్సును, చట్ట సవరణలను ఉపసంహరించాలని డిమాండ్ చేస్తున్నాము.

**6. రైల్వే, ఇన్సూరెన్సు, డిఫెన్సు, పెన్షన్ వంటి కీలక రంగాలలో ఎఫ్‌డిఐలను అనుమతించవద్దు**

ఈ రంగాలలో ఎఫ్‌డిఐ (విదేశీ ప్రత్యక్ష పెట్టుబడి) పరిమితిని కొన్నింటిలో 49 శాతం మేరకు మరికొన్నింటిలో 100 శాతం మేరకు మోడీ ప్రభుత్వం పెంచింది. వీటి ప్రైవేటీకరణకు, విదేశీకరణకు ఇది దారితీస్తుంది. దేశరక్షణకు, పెన్షన్ భద్రతకు ముప్పు వాటిల్లుతుంది. బిఎస్ఎన్ఎల్ ఎంఆర్ఎస్, సిజిహెచ్ఎస్ తదితర మెడికల్ సౌకర్యాలను రద్దుచేసి వాటి స్థానంలో మెడికల్ ఇన్సూరెన్సును రుద్దే పరిస్థితి ఏర్పడుతుంది. కాబట్టి కీలకమయిన ఈ రంగాలలో ఎఫ్‌డిఐని అనుమతించవద్దని డిమాండ్ చేస్తున్నాము.

**7. సమస్త రంగాల కార్మికులు, ఉద్యోగులు అందరికీ కనీస పెన్షన్ రూ. 3000 ఇవ్వాలి, పెన్షన్‌కు భద్రత కల్పించాలి**

ఈ భద్రత కోసం 2004లోను ఆ తరువాత రిక్రూట్ అయిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వోద్యోగుల పై రుద్దబడిన 'కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీము' (సిపిఎస్)ను రద్దుచేసి ప్రభుత్వ పెన్షన్ విధానం అమలు చేయాలి. పెన్షన్ నిధులను ప్రైవేటుపరం, విదేశీపరం చేసే విధానాల్ని రద్దు చేయాలి.

**8. కనీస వేతనం రూ. 18000కు తగ్గకూడదు. ధరల పెరుగుదలకి అనుగుణముగా దీనిని పెంచాలి**

1957లో జరిగిన 15వ భారత కార్మిక సదస్సు రూపొందించిన ఫార్ములా ప్రకారం వచ్చే మొత్తానికి మరో 25 శాతం కలిపి కనీస వేతనాన్ని నిర్ణయించాలని 31.10.1991 న సుప్రీం కోర్టు తీర్పునిచ్చింది. దీని ప్రకారం లెక్కించి కనీస వేతనం రు.18,000/- గా వుండాలని 7వ పే కమిషన్ నిర్ధారించింది. కాబట్టి ఈ డిమాండ్ ను ఆమోదించి అన్ని రంగాలలో అమలు చేయాలి.

**9. శాశ్వత పనికి కాంట్రాక్టు వర్కర్లను నియమించరాదు. వారిని రెగ్యులరైజ్ చేయాలి. కాంట్రాక్టు వర్కర్లకు రెగ్యులర్ వర్కర్లతో సమాన వేతనం ఇవ్వాలి. ఈపీఎఫ్,ఈ ఎస్ ఐ, కనీస వేతనాలు అమలు చేయాలి.**

**10. ధరల పెరుగుదలను ఆపాలి. ఇందుకోసం ప్రజాపంపిణీ వ్యవస్థని ఆదాయంతో నిమిత్తం లేకుండా అందరికీ వర్తించేలా సార్వత్రికం చేయాలి.**

సరుకుల వ్యాపారంలో ఫార్వర్డ్/ఫ్యూచర్స్ ట్రేడింగ్ పేరుతో జరుగుతున్న ఊహాజనిత వ్యాపారాన్ని నిషేధించాలి. పెట్రోల్/డీజిల్ పై విధించిన అధిక పన్నులను రద్దు చేసి ఉత్పత్తి ఖర్చుకు తగు లాభం కలిపిన రేటుకు అమ్మాలి.

**11. ఉద్యోగిత పెరిగేందుకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ శాఖలలో ప్రభుత్వరంగ సంస్థలలో రిక్రూట్మెంట్ పై నిషేదాన్ని ఎత్తివేసి వేకెన్సీలను భర్తీ చేయాలి. గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని మెరుగపరచాలి. పట్టణాలకు కూడా ఇటువంటి ఉపాధి హామీ పథకం అమలుచేయాలి.**

**12. అప్లికేషన్ పెట్టిన 45 రోజులలోగా ట్రేడ్ యూనియన్ ను రిజిస్టర్ చేయాలి. భారత ప్రభుత్వము ఐఎల్ఓ (అంతర్జాతీయ కార్మిక సంస్థ) కన్వెన్షన్ 87ను ఆమోదించి ప్రభుత్వ ఉద్యోగులతో సహా అన్ని రంగాలలో ట్రేడ్ యూనియన్ ఏర్పాటుకు గ్యారంటీ ఇవ్వాలి. కన్వెన్షన్ 98ని ఆమోదించి రహస్య బ్యాలట్ ద్వారా గుర్తింపు పొందిన యూనియన్ తో సమిష్టి బేరసారాలను గ్యారంటీ చేయాలి.**

## కార్మిక సంఘాల ప్రత్యామ్నాయం

ఈ 12 డిమాండ్స్ ను ఆమోదించి అమలు చేస్తే కార్మికుల, ప్రజల కొనుగోలు శక్తి పెరిగి తద్వారా ఆర్థిక వ్యవస్థలో ఏర్పడిన మాంద్యాన్ని తొలగించవచ్చు. ఇందుకు కావాల్సిన నిధులను సమీకరించేందుకు కార్పొరేట్లకిస్తున్న అక్రమ రాయితీలను రద్దుచేయాలి. ఆవిఎగగొట్టిన పన్ను బకాయిలను, అప్పులను వసూలు చేయాలి. విదేశాలకు తరలి వెళ్ళిన నల్లధనాన్ని వెనక్కి తీసుకు రావాలి. వామపక్ష ప్రజాతంత్ర శక్తులకు, కార్మిక సంఘాలకు, ప్రజా సంఘాలకు మాత్రమే ఈ ప్రత్యామ్నాయం పై ఆసక్తి వుంటుంది. బి జె పి, కాంగ్రెస్, టిడిపి, వైఎస్ఆర్సి, టిఆర్ఎస్ తదితర బూర్జువా భూస్వామ్య పార్టీలు ఈ పని చేయవు. ఆర్థిక విధానాలలో తేడా ఏమి లేనందున ఈ పార్టీల నాయకులు విధానపరమైన విమర్శ చేయకుండా వ్యక్తిగత ఆరోపణలకే ప్రాధాన్యత నిస్తున్నారు. బిజెపి ప్రభుత్వాలు ఒక వంక కార్మిక వ్యతిరేక, ప్రజా వ్యతిరేక విధానాలను ఉధృతముగా అమలు చేస్తూ మరో వంక ఈ విధానాలకు ప్రజల నుండి ప్రతిఘటన లేకుండా వుండేందుకు మతం పేరుతో ఉద్రిక్తతలను పెంచి పోషించే శక్తులను ప్రోత్సహిస్తున్నాయి. మన్మోహన్ సింగ్ ప్రభుత్వం అమెరికా సామ్రాజ్యవాదానికి తలవంచి నమస్కారం చేయగా మోడీ ప్రభుత్వం పాదాభివందనం చేస్తున్నది. ఈ ప్రజావ్యతిరేక ఆర్థిక విధానాలను వ్యతిరేకించి ప్రజా ప్రత్యామ్నాయాన్ని రూపొందించేందుకు, మతోన్మాద శక్తుల తప్పుడు ప్రచారాలను తిరస్కరించి ఐక్యతను కాపాడేందుకు భారత కార్మికవర్గం చేసే సుదీర్ఘ పోరాటాలలో భాగమే 2019 జనవరి 8,9 తేదీలలో జరుగు రెండురోజుల దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె. 1991 నుండి జరుగుతున్న సార్వత్రిక సమ్మెలలో ఇది 18వది. ప్రభుత్వ రంగ సంస్థలను, బిఎస్ఎన్ఎల్‌ను, కార్మిక హక్కులను, ప్రజా ప్రయోజనాలను కాపాడేందుకు ప్రజల మధ్య ఐక్యతను, మత సామరస్యాన్ని పెంపొందించేందుకు అన్ని రంగాల కార్మికులు, ఉద్యోగులతోపాటు ఈ రెండు రోజుల సార్వత్రిక సమ్మెలో పాల్గొని జయప్రదం చేయాలని బిఎస్ఎన్ఎల్ ఉద్యోగులకు విజ్ఞప్తి చేస్తున్నాము.

అభినందనలతో

**బిఎస్ఎన్ఎల్ ఎంప్లాయీస్ యూనియన్, ఎన్ఎఫ్‌టిఇ, బిఎస్ఎన్ఎల్ ఏటియం**
**ఆంధ్రప్రదేశ్ సర్కిల్**